www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

1

గురువారం 10 ఆగస్టు 2023

సిరిచెల్మలో కార్డన్‌సెర్చ్

ఇచ్చోడ : మండలంలోని సిరిచెల్మలో పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని బైకులు, ఆటోలు, జీపును స్వాధీనం చేసుకున్నారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్పీ, డీఎస్పీ నాగేందర్‌రెడ్డి ఆదేశానుసారం గ్రామంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించామన్నారు. సరైన పత్రాలు లేని 40 మోటర్ సైకిల్‌లు, 9ఆటోలు, జీపును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు తావివ్వకుండా గ్రామస్తులంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. అక్రమంగా మత్తు పదార్థాలు, కలప, గంజాయి వంటి వాటిని రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎస్సై నరేష్ కుమార్, సిరికొండ ఎస్సై శ్రీకాంత్, నేరడిగొండ ఎస్ఐ సాయన్న పాల్గొన్నారు.



అన్ని కులమతాలకు అండగా కేసీఆర్

బోథ్ : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని కులాలకు మతాలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. పొచ్చెర సాయి ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీసీ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 300 మంది బీసీ కుల వృత్తులకు చెక్కులను అందజేస్తున్నామని తెలిపారు. ఆడ బిడ్డ పెళ్లికి రూ.లక్ష సాయం చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, బిసి సంక్షేమ అధికారి రాజలింగు, బోథ్, బజార్‌హత్నూర్ ఎంపిడిఓలు సుశీల్‌రెడ్డి, రాథోడ్ రాధ, సర్పంచ్ సురేందర్ యాదవ్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కదిలిన కార్మిక దండు

- జిల్లా కేంద్రంలో మొదటి రోజు మహాధర్నా సక్సెస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తిగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్టియుసి తోపాటు పలు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుతో కలెక్టరేట్ కార్యాలయం ముందు మొదటి రోజు మహా ధర్నాలో భాగంగా వివిధ వర్గాల కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని ఇబ్బంది పెట్టేలా అనుసరిస్తున్న విధానాలను వెనక్కి తీసుకోవాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. రైతాంగానికి మద్దతు ధర కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయకూడదని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎంవిఐ యాక్ట్ 2019, ఎలక్ట్రిసిటీ బిల్లు 2022 వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 5 అమలు చేయాలని 73 షెడ్యూల్ పరిశ్రమలను పునరుద్ధరించాలన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను జీఎస్టీలో చేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికుల లాంటి స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే ఉద్దేశంలో భాగంగా మహాధర్నా పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, పిడుగు శంకర్, జిల్లా కార్యదర్శి కుమార్, శ్రీనివాస్, సంఘమిత్ర, సంతోషి, పుణ్యవతి, భూదేవి, సునీత, వసంత, పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, ఉపాధ్యక్షుడు ఆనంద్, రాజేందర్, ఓదేలు, త్రివేణి పాల్గొన్నారు.

వరదలో గల్లంతైన దళిత రైతు కుటుంబానికి ఆర్థికసాయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

భారీ వర్షాలకు వాగులో గల్లంతై ప్రాణాలు కోల్పోయిన చాంద(టి) గ్రామానికి చెందిన దళిత రైతు దశరథ్ కుటుంబానికి సీపీఐ(ఎం) సేకరించిన విరాళాలు రూ.5000 నగదును బుధవారం పార్టీ ప్రతినిధి బృందం అందజేసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ 15 రోజుల క్రితం కురిసిన భారీవర్షాలకు చాంద వాగులో దశరథ్ గల్లంతై దాదాపు 100కి.మీటర్ల దూరంలోని మహారాష్ట్రలో శవమై తేలాడని తెలిపారు. కుటుంబ సభ్యులకు కనీసం శవం కూడా దొరకలేదన్నారు. మహారాష్ట్ర వాసులే అంత్యక్రియలు నిర్వహించారన్నారు. దశరథ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు, 80 ఏండ్ల తల్లి ఉన్నారని పేర్కొన్నారు. పెద్దదిక్కును కోల్పోయి కుటుబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితుల సహాయార్థం పార్టీ సేకరించిన విరాళాలు రూ.10835లో రూ.5వేలు దశరథ్ కుటుంబానికి అందించి మిగిలిన డబ్బులను రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో భారీగా నష్టపోయిన ములుగు, వరంగల్ జిల్లాల బాధితులకు పంపామని తెలిపారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి దశరథ్ కుటుంబాన్ని అదులోవాలని కోరారు. ఆయన మరణానికి నష్టపరిహారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.25లక్షలు చెల్లించాలని, దళితబంధు ఇవ్వాలని, పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని, డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, నాయకులు లింగాల చిన్నన్న ,రేంజర్ల ప్రవీణ్, గంగారాం పాల్గొన్నారు

నియోజకవర్గానికి 11చెక్ డ్యామ్‌లు

- రూ.40.02 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు 11 చెక్ డ్యామ్‌లు రూ.40.02 కోట్లు మంజూరు అయినట్టు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. నీటిపారుదల శాఖ రెండో విడతలో జీఓ నెం. 20లోని భీంపూర్, సిరికొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, బోథ్, నేరడిగొండ మండలాల్లోని ఆయా గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మాణం చేపట్టనున్నారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, మంత్రి కేటీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలకు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి మృతికి సంతాపం

బాసర : ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థి జాదవ్ బబ్లూ మృతికి బుధవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి రూ.లక్ష 50వేల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, రూ.50 వేలు ఖర్చులకు అందించినట్లు తెలిపారు. విద్యార్థి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాసర మండల కేంద్రం నుంచి ఎంపికైన 15 మంది విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు, హాస్టల్, మెస్, తరగతి గదుల వద్ద సలహాల బాక్స్ ఏర్పాటు చేస్తామని, వీసీ వెంకటరమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ ఆయా శాఖల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో స్వర్ణ గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ప్రహరి గోడ నిర్మాణానికి బుధవారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంలో ఎంపీపీ మాట్లాడారు. ప్రహరి నిర్మాణం పూర్తియితే పశువులు రాకుండా ఇబ్బందులు తొలుగుతాయని అన్నారు. గోడ నిర్మాణానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి రూ.32 లక్షలు మంజూరు చేశారని అన్నారు. వారికి పాఠశాల విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ప్రహరి గోడ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, హఫీ, రాజేశ్వర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం దరఖాస్తులతో బిజీబిజీ

వాంకిడి : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి మండల కేంద్రంలోని మీసేవా, జిరాక్స్ సెంటర్లలో లబ్దిదారులు బారులు తీరుతున్నారు. వివిధ గ్రామాల నుండి ప్రజలు వచ్చి దరఖాస్తులు అందజేస్తున్నారు. మూడు రోజులే గడువు ఉండడంతో బిజీబిజీగా ఉన్నారు. ప్రతి ఒక్కరు దరఖాస్తు కోసం ఎగబడుతున్నారు. కొంతమందికి దీనిపై అవగాహన లేకపోవడంతో కావాల్సిన పత్రాలు జమ చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ముందుగానే ఇలాంటి పథకాలపై అవగాహన కల్పిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తవని దరఖాస్తుదారులు అంటున్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

లక్ష్మణచాంద : మండలానికి చెందిన బిజెపి నాయకులను బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. మంగళవారం బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య చేసుకోవటంతో బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థి కుటుంబానికి న్యాయం జరగాలని ఆందోళన చేయనున్నారని తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని బీజేపీ అధ్యక్షులు పొలాస గోవర్ధన్, సర్పంచ్ ముత్యంరెడ్డి అన్నారు. అరెస్ట్ అయిన వారిలో గోవర్ధన్, ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, ముత్యంరెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, మండల అధ్యక్షులు రాపాని గంగాధర్, రామ్‌రెడ్డి, చిన్నయ్య, గంగాధర్, దశగౌడ్, రవి ఉన్నారు.

వీరవెల్లిలో స్వచ్ఛ సర్వే

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని వీరవెల్లి గ్రామంలో సర్పంచ్ తుమ్మె ద్రుపతాబాయి, కార్యదర్శులు, వార్డుసభ్యులు కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించి పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్లకు బీజేపీ సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిటైర్డ్ అయిన ఆర్మీ జవాన్లను బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సన్మానించి మాట్లాడారు. జవాన్లు అందించిన సేవలు ఎనలేనివి, సంవత్సరాల పాటు కుటుంబాన్ని వదిలేసి దేశం కోసం ఎండనకా వానానకా రక్షణగా ఉన్నారని కొనియాడారు. త్యాగాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. జవాన్లకు 5ఎకరాల భూమి, ఇంటి నిర్మాణానికి భూమి ఇవ్వకపోవడం చాలా దురదృష్టకరమైన విషయమన్నారు. సమావేశంలో జోగు రవి, మయూర్‌చంద్ర, లోక ప్రవీణ్‌రెడ్డి, ఆకుల ప్రవీణ్, రాజేష్, మహేందర్, లాలా మున్నా, గంగారెడ్డి ఉన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

రెబ్బెన : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలోని ప్రతి సింగరేణి ఉద్యోగి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి గ్రామ పోస్టాఫీసులో త్రివర్ణ పతకాలు అందుబాటులో ఉండనున్నాయన్నారు. ఈ నెల 13 నుండి 15 వరకు ప్రతి ఒక్కరు పతకాన్ని ఎగరవేసి దేశభక్తిని చాటాలని జీఎం కోరారు.

ఉపాధిహామీపై గ్రామసభ

కౌటాల : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీలో జరిగిన పనులపై సర్పంచ్ వొజ్జెల మౌనీష్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కూలీలు పనులు చేసుకొని లబ్ధిపొందాలని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్



నవతెలంగాణ - కాగజ్‌నగర్

సిర్పూర్ నియోజకవర్గంలో అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అవినీతిని ప్రోత్సహిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేతోపాటు వత్తాసు పలికే అధికారులు సైతం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ తెలిపారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారం రోజుల క్రితం బెజ్జూర్ గ్రామపంచాయతిలో రూ.6లక్షల అవినీతి జరిగిందని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. బెజ్జూర్ సర్పంచి అన్వర్ హుస్సేన్‌ను అకారణంగా సస్పెండ్ చేశారని, హైకోర్టు ఆర్డర్ ఇచ్చినా ఎమ్మెల్యే సతాయిస్తున్నాడని అన్నారు. భట్టుపల్లి గ్రామపంచాయతీలో రూ.1.30కోట్ల అవినీతి జరిగిందని, ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎమ్మెల్యే వత్తాసుతో చర్యలు తీసుకోవడం లేదన్నారు. మొగడ్‌దగడ్, గుడ్లబోరి పంచాయతీల్లో సైతం అవినీతి జరిగిందని వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారం రోజుల సమయం ఇస్తున్నానని, అవినీతిపరులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర నలుమూల నుండి వచ్చి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోసమే గృహలక్ష్మి పథకం తెచ్చారని పేర్కొన్నారు. అన్ని పరీక్షలు ఒకే నెలలో పెట్టడం విడ్డూరంగా ఉందని, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల మధ్య గడువు లేకుండా నిర్వహించడం పట్ల అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సిర్పూర్(టి) : స్వాతంత్ర్య వచ్చి ఇన్నేండ్లైన బహుజన బిడ్డల బతుకులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసుల వెనుకబాటుతనాన్ని గుర్తించి వారు అన్ని రంగాల్లో సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ప్రత్యేకంగా గుర్తించిందని తెలిపారు. అయినప్పటికీ దేశ పాలకులు వారి అభివృద్ధికి మాత్రం ఏమాత్రం ఆలోచించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ ప్రాంతాలు నేటికీ మౌళిక సదుపాయాలకు నోచుకోలేదని, ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత వారికి ప్రత్యేక హోదా కల్పించి అభివృద్ధి చేస్తామని సీఎం ఉద్యమ సమయంలో హామీ ఇచ్చి మాట మార్చారని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్‌హుస్సేన్, షేక్‌చాంద్, నాగేష్, బుర్స పోచయ్య, ప్రవీన్‌కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు త్వరలో ఇండ్ల స్థలాలు

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని వర్కింగ్ జర్నలిస్టులకు త్వరలో ఇంటి స్థలాలను అందిస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న హామీ ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన జర్నలిస్టు జేఏసీ కన్వీనర్ దేవేందర్, కోకన్వీనర్‌లు వెంకటేష్, మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. కొన్నేండ్లుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పిలిపించారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములపై అధికారులతో చర్చించారు. తక్షణమే సర్వే నిర్వహించి, త్వరలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లతో పాటు ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, రిపోర్టర్లు ఉన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్ బృందం పరిశీలన



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూరు గ్రామంలో స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లను, ఇంకుడు గుంతలను, సెగ్రిగేశన్ షెడ్లను కేంద్ర బృందం సభ్యులు సుద్దాల గణేష్, గాండ్ల సునీల్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మరుగుదొడ్లను పరిశీలించి ఉపయోగంలో ఉన్నాయా లేదా అని ఇంటింటికి తిరిగి తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలు, సెగ్రిగేశన్ షెడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్లూరు సర్పంచ్ దుర్గం రాజన్న, ఎంపీడీఓ గంగాసింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మానందం, సీసీ కల్పన, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్ పాల్గొన్నారు.

జీఎంను సన్మానించిన ఉపాధ్యాయులు



రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాకు బదిలీపై వచ్చిన నూతన జీఎం జనరల్ మేనేజర్ రవిప్రసాద్‌ను గోలేటిలోని సింగరేణి హైస్కూల్ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహూకరించారు. అనంతరం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సంఖ్యపై జీఎం ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఐ లక్ష్మణ్‌రావు, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయుడు కె భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాత్మ గాంధీ, నెహ్రూ, వల్లబాయ్ పటేల్ త్యాగఫలమే క్విట్ ఇండియా ఉద్యమమని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి దివంగత నేత సీఆర్ఆర్ నివాసం వద్ద క్విట్ ఇండియా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం అక్కడే యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ యూత్ కాంగ్రెస్ జెండాను ఎగరవేశారు. అదే విధంగా ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుమ్రం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జై ఆదివాసీ.. జై కాంగ్రెస్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మహనీయుల త్యాగల వల్లనే క్విట్ ఇండియా ఉద్యమం పెద్ద ఎత్తున సాగిందని, దాని ఫలితమే నేడు స్వతంత్ర్యంగా జీవిస్తున్నామని సాజిద్‌ఖాన్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలకపాత్ర పోషించిందని, మరోవక్క తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని, భూమి భుక్తి కోసం పోరాడిన భీంను ఆదర్శంగా తీసుకుంటూ ఆదివాసీలు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భారత్ వాఘ్మరే, దిగంబర్ పాటిల్, శ్రీకాంత్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, నగేష్, అర్బాత్‌ఖాన్, ఆనంద్‌రావ్, భూపెల్లి శ్రీధర్, రాహుల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



నవతెలంగాణ-భీమారం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ బత్తుల విశ్వంబర్‌ను మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను బుధవారం చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు భూవివాద సమస్యలు దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నాయకులు దాసరి మధునయ్య, సోదరి మల్లేష్, గోదారి ప్రభాకర్, జలంపెల్లి తిరుపతి, దారావత్ సుధాకర్ పాల్గొన్నారు.

పోలీసులు వేధింపులు మానుకోవాలి

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

కుల వ్యవస్థను రద్దు చేస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఐదేండ్లుగా పోరాడుతున్న తనపై మూడు నెలల కిందట జిల్లా పోలీసులు ఉపా కేసు నమోదు చేశారని, కండీషన్ బెయిల్‌పై రెండు వారాల కింద విడుదలయ్యాయని కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ తెలిపారు. వారానికి రెండుసార్లు పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో హాజరై ఇంటికెళ్తున్న క్రమంలో పోలీసులు అడ్డగించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వేధింపులు మానుకోవాలని, లేకుంటే జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పెంచాలి

రెబ్బెన : గృహలక్ష్మి పథకం దరఖాస్తులు తీసుకోవడానికి ఈ నెల చివరి వరకు గడువు పెంచాలని, కేవలం మూడు రోజుల గడువు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి అయోమయానికి గురవుతున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోచం అన్నారు. ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు తీసుకోవాలంటే 10 రోజుల సమయం పడుతుందేని, ప్రభుత్వం గుర్తించి గృహలక్ష్మి పథకం గడువు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తహసీల్దార్ బదిలీ

బెజ్జూర్ : తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీపాల్ బదిలీపై కాగజ్‌నగర్‌కు వెళ్లడంతో బుధవారం ఆయనను కార్యాలయం సిబ్బంది శాలువాలతో సత్కరించారు. శ్రీపాల్ చేసిన సేవలను కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పెంచాలి

నవతెలంగాణ-బేల

గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పొడగించాలని బీజేపీ మండల అధ్యక్షులు దత్త నిక్కం అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బిజెపి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు కేవలం మూడు రోజులే గడువు ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి తరలివస్తున్నారని తెలిపారు. కానీ ఇక్కడ ఒకే సెంటర్ ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండల కేంద్రంలో మరో సెంటర్‌ను ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో జాప్యం లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఖోడే ప్రదీప్, నవీన్, ఉప సర్పంచ్ వడ్డే పోశెట్టి, సందీప్, జీవన్, మహేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఘన సన్మానం

నవతెలంగాణ-దిలావర్‌పూర్



ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. దేశ సేవే లక్ష్యంగా, కుటుంబాలను, ఊరిని వదిలి రాత్రనక పగలనక దేశ సరిహద్దులో పనిచేసి పదవి విరమణ పొందిన సైనికులను, తెలంగాణ తొలి దశ ఉద్యమంలో అసువుబాసిన అమరులకు, ఉద్యమకారులకు వారి కుటుంబీకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించాలనే బీజేపీ నిర్ణయం మేరకు తెలంగాణ ఉద్యమకారుడు సంబు భోజారాం పటేల్, రాజాకర్ ఉద్యమ కారుడు కట్కం ముత్యంరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీసరి శైలేష్, లక్ష్మణ్, వార్డు సభ్యులు సాయి, రవి, రాజమల్లు, నవీన్ పాల్గొన్నారు.

సోయాబీన్ పంటలో రసం పీల్చే పురుగులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



సోయాబీన్ పంటలో ప్రస్తుతం వైరస్ ఉధృతి ఎక్కువగా ఉండటంతో మండలంలోని గుండంపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రవంతి మాట్లాడుతూ వైరస్‌ను వ్యాప్తి చెందించే వాహకాలయిన రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు రంగు బుట్టలు ఎకరానికి పది చొప్పున అమర్చుకోవాలని పేర్కొన్నారు. ఒక ఎకరా సోయాబీన్ పంటకి డైఫెంతియురాన్ మందును 250 గ్రాములు పిచికారి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీదేవి, అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలను బావితరాలకు అందించాలి

- ఉట్నూర్‌లో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఉట్నూర్

తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం స్థానికంగా ఆదివాసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ దినోత్సవానికి జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితో కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. వీరిని ఆదివాసులు గుస్సాడి నృత్యాలతో సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా కేబీ ప్రాంగణంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికి ఈ సందర్భంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అన్నారు. ఏజెన్సీ ప్రాతాలలో విద్యా వైద్యం, ఉపాధి, వ్యవసాయం, రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. జిల్లాలో 12, 222 మందికి పోడు భూముల పట్టాలను పంపిణీ చేయడంతో పాటు రైతుబంధును అందించడం జరుగుతుందని అన్నారు. మిగిలిన పోడు భూములను మళ్లీ సర్వే చేపట్టి అర్హులైన లబ్దిదారులకు అందేలా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. గిరి వికాసం పథకం కింద ఇప్పటి వరకు 600 గిరిజన ఆవాసాలకు త్రిఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. గిరిజన గూడాలు, తండాలలో మాత, శిశు మరణాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, వంతెనలకు మరమ్మతులు చేపట్టి రహదారులను పునరుద్ధరిస్తామని అన్నారు. గిరిజన యువత ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో వృత్తి నైపుణ్య శిక్షణలు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆదివాసీ, గిరిజనులు సద్వినియోగపరచుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆదివాసులు యువత ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవ సంబురాలు జరుగుతున్నాయని, ఆదివాసుల అభివృద్ధికి పోలీస్ శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిచడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. అంతకు ముందు ఆదివాసీ ప్రతినిధులు మాట్లాడుతూ పలు సమస్యలపై సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఐడీడీఏ డీడీ దిలీప్ కుమార్, ఎంపీపీ జైవంత్ రావు, ఈఈ భీంరావు, పీవీటీజీ ఏపీఓ భాస్కర్, ఆర్సీఓ గంగాధర్, జిల్లా సార్‌మేడి దుర్గ పటేల్, వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఉన్నారు.

తాంసి : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తాంసి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల అంబుగాంతో పాటు భీంపూర్ మండల



కేంద్రంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నా ప్రభ సంతోష్, కుమురం భీం చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాంసి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు బ్యాండు వాయిద్యాలతో గిరిజన ఆరాధ్య దైవంగా భావించే, కుమురం భీం చిత్రపటాన్ని గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింబాజీ, రైతు సమితి కోఆర్డినేటర్ అనిల్, ఆదివాసీ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు భరత్, పురుషోత్తం, ఆదివాసీ నాయకులు అన్ను పటేల్, యశ్వంత్, పోచ్చిరాం ఉన్నారు.

బజార్‌హత్నూర్ : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండల కేంద్రంతో పాటు మండలంలోని వర్తమాన్నూర్, జాతర్ల, చింతల్ స్వాంగి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.



ఇందులో భాగంగా ఆదివాసీ గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వర్తమాన్నూర్ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బీఎస్పీ బోథ్ ఇన్‌చార్జీ మెస్రం జంగుబాపు మాట్లాడుతూ 75 సంవత్సరాల భారతదేశంలో ఆదివాసీ సమాజానికి ఇప్పటివరకు రోడ్డు, విద్యా వైద్య అందని పరిస్థితి ఆదివాసీ గ్రామాలో ఉందని అన్నారు. ఆదివాసుల మనుగడను కాపాడుకోలేని రాజకీయ పార్టీలను ఆదివాసులు తరిమికొడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాడవి సాగర్, గణపతి, భగవాన్, జలపతి లక్ష్మణ, కిరణ్ కుమార్, రాజు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆదివాసులు ఆదివాసీ, దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని మాన్యాపూర్, భీంపూర్ గ్రామాలతో పాటు తదితర ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసులు సంస్కృతి, సాంప్రదాయ బద్దంగా నృత్యాలు చేసి జెండాను, ఆదివాసీ నాయకులు గ్రామ పటేళ్లు ఆవిష్కరించారు. జల్.. జంగల్.. జమీన్.. కోసం పోరాడిన మహనీయుడు కుమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ రూపదేవ్, ఏఎంసీ వైస్ చైర్మెన్ తోడసం నాగోరావ్, దుర్వ పాపయ్య, చల్లూరి నేతాజీ, దుర్వ హన్మయ్య, జరచంద్, గోవింద్ రావ్, తానాజీ, కేశవ్ ఉన్నారు.

తలమడుగు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కుమురం భీమ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. అదేవిధంగా గిరిజనుల విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి జంగాల పోచ్చన్న మాజీ జెడ్పీటీసీ త్రియంబక్, తుడుం దెబ్బ సంఘం నాయకులు జ్ఞానేశ్వర్, భుజంగ్‌రావు, మాజీ సర్పంచ్ రమేష్, ప్రభాకర్, ధర్మ పటేల్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు రవికాంత్ యాదవ్, ఆదివాసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.





గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్లి(బి) గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల వలె మూగజీవాలకు సైతం అనేక వ్యాధులు సోకుతాయని, మూగజీవాల పట్ల ప్రతి ఒక్కరం కనికరంగా ఉండాలని అన్నారు. పశువులలో నోటిలో పుండ్లు, చొంగ కారడం కాళ్లడెక్కల మధ్యన పుండ్లు ఏర్పాడటం లక్షణాలు ఉంటాయని అన్నారు. ఆవులు గేదెలు అబార్షన్ అవడం పాల దిగుబడి తగ్గిపోవడం జరుగుతుందని అన్నారు. నేటి సమాజంలో మూగ జీవాల పట్ల పర్యవేక్షణ టీకాలను మండల రైతులు తమ తమ పశువులకు తప్పకుండా వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర లక్ష్మి సోమన్న, ఎంపీటీసీ మర్సుకొల యశోద, పశు వైద్యాధికారి దూద్‌రాం, సిబ్బంది సౌమ్య, స్వామి, విజయ్, సుదర్శన్, గోపాల మిత్రలు గంగన్న, అశన్న, సాయి రైతులు రవీందర్‌రెడ్డి, యాదవ్‌రావు, విఠల్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల గడువు పెంచాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మద్యం షాపులకు పది రోజులు సమయం ఇచ్చి, పేదల ఆత్మ గౌరవపు చిహ్నం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ గృహలక్ష్మి పథకానికి మూడు రోజులే సమయం ఇవ్వడం సరైంది కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గృహలక్ష్మీ పథకానికి ఎవరి సొంత జాగాలో వారికి రూ.5లక్షల సాయం చేయాలని అన్నారు. దరఖాస్తు గడువు 15 రోజుల వరకు ఇవ్వాలని ఆ వైపుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సంతోష్, కొత్తపెల్లి సంతోష్, సతీష్‌రెడ్డి, తాటి సతీష్, కాంత, భాగ్యలక్ష్మి, సబ్దర్, ప్రశాంత్, పెంటాజీ, అనిల్ ఉన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి : బీజేపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఏ పోస్టుల భర్తీ కోసం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయడంతో పాటు ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. కాగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఎన్‌ఎంలు చేపట్టిన ధర్నాకు ఆమె మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా తమ సేవలందిస్తూ, కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించిన, ఏఎన్‌ఎంలు తమ తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డు పైకి రావడం బాధగా ఉందన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తానని చెప్పిన సీఎం కాంట్రాక్టు వ్యవస్థని ఎందుకు రద్దు చేయడం లేదో తెలపాలని అన్నారు. ఏఎన్‌ఎంలతో వెట్టి చాకిరి చేయించుకొని, రెగ్యులర్ చేయాలంటే పరీక్ష రాయాలనడం సరికాదని, ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట బీజేపీ నాయకులు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

గృహలక్ష్మి పథకం పచ్చి బూటకం : పాయల్ శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గృహలక్ష్మి పథకం ద్వారా ప్రజలను మళ్లీ మోసం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు వచ్చిందని, మద్యం దుకాణాల టెండర్లకు 15 రోజులు గడువు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కేవలం రెండు రోజుల సమయం ఇవ్వడం చాలా దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్యం మీద ఉన్న ప్రేమ ప్రజల మీద లేకపోయేనని ఎద్దేవా చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇల్లు కట్టుకోవడానికి రూ.3లక్షల ఆర్థిక సాయం చేస్తామన్నప్పుడు అవసరమైన ధృవపత్రాలను సేకరించాలే తప్పా కుల ధృవీకరణ పత్రం ఎందుకని ఆయన ప్రశ్నించారు. దళితబంధు పేరిట దళితులను మోసం చేసి, గిరిజన బంధు అయితే అసలే కానరాకపాయేనని అన్నారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక చేయూత అనే మాట పైపైనే, ప్రతిరోజు తెలంగాణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ తీరును మార్చుకొని గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకొనుటకు 15 రోజుల గడువును పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు సేకరించిన తర్వాత రెండు రోజులలో సర్టిఫికెట్లను అర్హులకు అందజేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో లాలా మున్నా, చిలుకూరి జ్యోతిరెడ్డి, దినేష్ మాటోలియా, ధోని జ్యోతి, జోగు రవి, ఆకుల ప్రవీణ్, సోమ రవి, మహేందర్, దయాకర్, ముకుంద్ ఉన్నారు.

ఇచ్చిన హామీలను నేరవేర్చని బీజేపీ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలో బీజేపీ అధిరంలోకి వచ్చి తొమ్మిదేండ్లు అవుతున్న ఇచ్చిన ఏ ఒక్క హామీ నేరవేర్చక పోక కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆరోపించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుదామనే నినాదంతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మహాపడావ్ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం తొలి రోజు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేలా ఉద్యమాలు చేపట్టాలని, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు తీర్మణం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పెట్టుబడిదారులకు అనుకులంగా వ్యవహరిస్తు కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసిందన్నారు. నాలుగు కోడ్లుగా తీసుకురావడంతో కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తు ఉన్న ఉద్యోగాలను కొల్లగొడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు దర్శనాల మల్లేష్, ఆశన్న, వెంటకనారాయణ, సునీత, రాజు, దేవేందర్ ఉన్నారు.

స్వయం పాలన సాధనకై పోరాడుదాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ, గిరిజనుల స్వయం పాలన సాధనకై పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడం సాయికుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవన్‌లో కుమురం భీమ్, రాంజీ గోండ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించాలని పీసా చట్టం 1/70 రెగ్యులేషన్, అటవీ హక్కుల చట్టం 2006ను సమగ్రంగా అమలు చేయాలని అన్నారు. జీఓ నెంబర్ 3ను పునరుద్ధరించాలని అన్నారు. విద్యావంతులైన ఆదివాసీ గిరిజన యువతి యువకులను ఉద్యోగ అవకాశాలు కల్పించాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కుమ్ర అశోక్, ఆత్రం వినోద్, గజానంద్, కోరింగ రవీందర్, అనిల్, సాయి కృష్ణ, ఆకాష్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తులకు బారులు తీరిన జనం

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి రెండు రోజులు గడువు ఇవ్వడంతో దరఖాస్తుదారులు పరుగులు తీస్తున్నారు. 10వ తేదీ ఆఖరు గడువు ఉండటంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుదారులు ఇన్ కం క్యాస్ట్, గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోవడానికి రాగా కార్యాలయం రద్దీగా మారింది. రెండు రోజులు సమయం ఉండటంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. అటు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది బిజీబిజీగా ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : అదిలాబాద్ మావల మండల కేంద్రంలో బుధవారం గృహలక్ష్మి కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలు బారులు తీరారు. కార్యాలయాలు ఆయా గ్రామ ప్రజలతో కిక్కిరిసిపోయింది. మహిళలు చిన్నపిల్లలతో గృహలక్ష్మి దరఖాస్తులు పట్టుకొని ఇబ్బందులు పడ్డారు. కార్యాలయంలో తాగేందుకు నీళ్ల లేక ప్రజలు అవస్థలు పడ్డారు. సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానికి ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బంగారుగూడ, అనుకుంట మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పాంచ్ ప్రన్ ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్మీ ప్రేమ్‌సాగర్, మద్రాస్ 12 రెజిమెంట్ సిపాయి ప్రణయ్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ జాగ్‌రామ్ అంతర్వేది, పాఠశాల చైర్మెన్ సునీల్ రౌత్ ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు విలాస్, తో పాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.దయాకర్, ఎండీ అశ్రాఫ్ అలీ, కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.శ్రీనివాస్, అకాడమీ కోఆర్డినేటర్ రఘునాథ్, పీడీ అనిత, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీతో రైతులకు ఒరిగిందేమీ లేదు.. ప్రణాళిక లేని గృహలక్ష్మి

- కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు



నవతెలంగాణ-సారంగాపూర్

రుణమాఫీతో రైతులకు ఒరిగిందేమీ లేదని, తెలంగాణ సీఎం కేసీఆర్ రైతులకు ఇస్తున్న అబద్ధపు హామీలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు కుచాడి శ్రీహరిరావు, రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని స్వర్ణలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రణాళిక లేక లేని గృహలక్ష్మి పథకంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేయడంతో రైతులకు ఎలాంటి లాభం చేకూరాలేదని అన్నారు. 2018 సంవత్సరంలో తీసుకున్న రుణం 2023 సంవత్సరం నాటికి డబుల్ అయ్యిందని అన్నారు. ఈ రుణ మాఫీతో రైతులకు ఒరిగిందేమీ లేదని అన్నారు. 2018-2023 వరకు వడ్డీతో సహా రూ.2లక్షలు రైతులు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటి కళాశాల విద్యార్థుల మృతిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహ వ్యక్తం చేశారు. గృహలక్ష్మి దరఖాస్తుల గడువు ఎక్కువగా లేకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. దీంతో గడువును పెంచాలని అన్నారు. నిరుపేదలకు గృహలక్ష్మి కింద రూ.5లక్షలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలను అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దశరథ రాజేశ్వర్, నాయకులు బోలోజి నర్సయ్య, సలీమ్ హది, నాయకులు ఉన్నారు.

ఆదివాసులంటే మన వారసులు : ఎస్పీ

- ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎస్పీ
- ఎస్పీకి, ఫోటోగ్రాఫర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసులంటే మన వారసులని, 70 ఏండ్ల చరిత్ర చూస్తే ముందుగా పుట్టింది ఆదివాసులేనని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వం సైన్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల సిబ్బందితో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఫోటోలను తిలకించి, లింగంపల్లి కృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాల ఫోటోలు కండ్లకు కట్టినట్లు ఉన్నాయని అన్నారు. వారి సంస్కృతి సాంప్రదాయాలు నేటికి చెక్కుచెదరకుండా ఇప్పటికి కొనసాగుతున్నాయని అన్నారు. ఫోటోగ్రఫీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీని, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్‌ను కళాశాల బృందం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్‌రామ్ అంతర్వేది, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, ఏ వెంకట్, ప్రముఖ జర్నలిస్ట్ హర్పాల్ సింగ్, సుధీర్ కళాశాల అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, రమేష్‌రెడ్డి, తిరుపతి, ప్రతాప్ సింగ్, నరసింగరావు, రఘునాథ్, జాకీర్ హుస్సేన్, అనిత, జోత్స్న, సాయి ప్రసాద్, శ్రీనివాస్, దయాకర్, విజయకుమార్, రాజ్ కుమార్, కపిల్ విద్యార్థులు ఉన్నారు.

కనక లక్కేరావు మృతి పార్టీకి తీరని లోటు



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మెన్ కనక లక్కేరావు ఆకాల మరణం పార్టీకి తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. బుధవారం కనక లక్కేరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కుమురం భీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు స్థానికంగా సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు అజీమోద్దిన్, కుందుకురి రమేష్, నాయకులు ఉన్నారు.

పంద్రాగస్టు వేడుకలపై సమీక్ష

నవతెలంగాణ-నస్పూర్

77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అన్ని విభాగాల అధిపతులతో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్ట్ 15న నిర్వహించబోవు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(ప) పి అరవిందరావు, డీజీఎంలు (సివిల్) శివ రావు, ఆనంద్ కుమార్, డీజీఎం (ఐఈడి) చిరంజీవులు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పీఓ పి.కాంతారావు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-తాండూర్



ఏఎన్ఎం, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు సమిష్టి కృషితో తల్లిపాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూపర్‌వైజర్ మమత సూచించారు. బుధవారం మండలంలోని రేచింగ్ రోడ్ రైల్వే స్టేషన్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీలోని ఆరోగ్య కమిటీ సభ్యులు సమక్షంలో తల్లిపాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక బృందాలు సామాజిక కార్యకర్తల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనసూయ, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, పూలవతి, ఆశ మల్లీశ్వరి, స్రవంతి పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

గృహలక్ష్మీ పథకం నిరంతర ప్రక్రియఅని దరఖాస్తుల విషయంలో ప్రతిపక్షాలు చేసే అసత్య ప్రచారాలకు ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ఇండ్లులేని నిరుపేదల కోసం ఖాళీ స్థలం ఉండి సొంత ఇల్లు కట్టు కోవడానికి రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందించే గృహలక్ష్మి కోసం దరఖాస్తుదారులు దరఖాస్తు చేసే విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్రామ కంఠంలో ఉన్న పాత ఇల్లు కాని, స్థలాలకు కానీ దస్తావేజు పేపర్లు ఉండవు కాబట్టి ఇంటి నంబర్ లేదా ఖాళీ స్థలం ఉన్నావారు. దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. గృహలక్ష్మీ పథకానికి గడువు అయిపోయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దరఖాస్తుదారులు తమతమ ప్రజాప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ధరఖాస్తులు పంపించవచ్చునని ఇది నిరంతర ప్రక్రియని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి ప్రస్తుతం మొదటి దశలో 3వేల ఇండ్లు పూర్తి అయిన తర్వాత రెండో దశలో ఇచ్చే గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ఇండ్లు లేని పేదలు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదని దశల వారీగా అర్హులైన పేదల ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి అమలు చేస్తారని తెలిపారు.

గృహలక్ష్మీ దరఖాస్తుల గడువును పొడిగించాలి

- సీఐటీయూ మండల కన్వీనర్ కూటికెల ఆనంద్ రావు



నవతెలంగాణ-కెరమెరి

గృహలక్ష్మి దరఖాస్తు గడువును పెంచాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 25 ద్వారా ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు తీసుకుంటామని ప్రకటించడంతో ఇండ్లు లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రకటన ఇచ్చి కేవలం 3రోజులే గడువులోగా దరఖాస్తు ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. చాలా మందికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల ఇండ్లు లేని నిరుపేదల సౌకర్యార్థం దరఖాస్తు గడువును మరో 10రోజులు పొడిగించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కూటికెల గణేష్ శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

ఆదివాసుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను హైదరాబాదులో కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలో ఉన్న గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రోడ్లు విద్యుత్తు మంచినీటి సౌకర్యాలు లేక చాలా గిరిజన గ్రామాలు వెనుకబడిపోతున్నాయన్నారు. వారిని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఈ మధ్యకాలంలో గిరిజనులు పోడు చేసుకుంటున్న భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలిచ్చి ప్రభుత్వం వారికి సహకరించిందన్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు మురుమడుగుల శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-జన్నారం

యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో పండ్లను, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ అవిర్భవించి 63 సంవత్సరాలు విజయవంతగా పూర్తిగా చేసుకుందని యువజన కాంగ్రెస్ విభాగం యువత కోసం విద్యార్థుల కోసం అనేకమైన ఉద్యమాలు చేసింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దూమల్ల రమేష్, రాయమల్లు గౌడ్, ప్రచార కార్యదర్శి అజార్ నాయకులు ఇర్నాల గంగన్న, సయ్యద్ ఇంబ్రహీం, బెడద సత్యన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్, రాహుల్ యాదవ్, పాదం రాకేష్, పవన్, రాకేష్ గౌడ్ పాల్గొన్నారు.

4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- వామ పక్ష కార్మిక సంఘాల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-హాజీపూర్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తు ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం వామపక్ష కార్మిక సంఘంగా ఆధ్వర్యంలో మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి నేటి వరకు కార్పొరేట్లకు అనుకూలంగా, ప్రజా, కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తుందనీ పేర్కొన్నారు. జాతీయ సహజ వనరులైన ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తుందన్నారు. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యసర సరుకులు ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై మోడీ సర్కార్ ఉక్కు పాదం మోపిందన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులను తుగలో తొక్కుతుందని ఆరోపించారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను జఠిలం చేస్తుందన్నారు. అనేక త్యాగాల రక్త తర్పణతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తూ పార్లమెంట్లో చట్టం చేసిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతంతో దళిత, గిరిజన, క్రైస్తవ, ముస్లిం, మైనార్టీల మహిళల హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. కార్మిక వర్గంలో వైశాల్యాలు పెంచుతుందన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష భావోద్వేగాలతో వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని కుట్ర పన్నుతుందనీ తెలిపారు. కేంద్ర బీజేపీ వినాశకర చర్యలు అన్నిటిని కార్మవర్గం ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు, విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కలిందర్ ఖాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఐఎఫ్టీయు మేకల రామన్న, తోకల తిరుపతి, జాడి దేవరాజ్, అరుణ, శ్రీనివాస్, దేవయ్య, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి హామీతో జీపీ కార్మికుల సమ్మె విరమణ

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు జీపీ కార్మికులు సమ్మె విరమిస్తున్నట్టు జేపీసీ నాయకులు ప్రకటించారు. మంగళవారం సమ్మె విరమణ పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందజేశారు. గ్రామ పంచాయతీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత 34 రోజులుగా పనులు అన్ని బంద పెట్టి సమ్మె నిర్వహించడం జరిగింది. మంత్రి స్పందించి సమస్యలు పరిష్కరం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు, గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మెకు సహకరించిన, మద్దతుగా వచ్చిన రాజకీయ పార్టీలకు, ప్రజ సంఘాల నాయకులు అందరికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు దాసరి సురేష్, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు (సీఐటీయూ)దుంపల రంజిత్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మేకల రామన్న, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ పాల్గొన్నారు.

కడెం ఎత్తు పెంచి అదనపు గేట్లు నిర్మించాలి



నవతెలంగాణ-జన్నారం

కడెం ప్రాజెక్టు ఎత్తును పెంచి అదనపు గేట్లను నిర్మించాలని కడెం ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ కు నిర్మల్ జిల్లా కేంద్రంలోని మినిస్టర్ క్యాంపులో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సభ్యులు నైనాల గోవర్ధన్, రాజశేఖర్, తాళ్ల పెల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు సామర్థ్యం కన్నా ఎక్కువ నీరు రావడంతో ముంపునకు గురువుతుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రాజెక్టు అధిక వర్షాలకు ముంపునకు గురైతే ఇప్పటివరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కడెం ఆయకట్టు కింది దస్తురాబాద్ జన్నారం దండేపల్లి లక్సటిపేట హాజీపూర్ మంచిర్యాల మండలాలకు చెందిన రైతులు ప్రతి సంవత్సరం, ఆందోళనకు గురవుతున్నార అన్నారు. కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచి అదనపు గేట్లు ఏర్పాటు చేసినట్లయితే ప్రాజెక్టు ముంపునకు గురికాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కడెం ప్రాజెక్టు ఆయా కట్టు అభివృద్ధి కమిటీ సభ్యులు, గుర్రం మోహన్ రెడ్డి, ఏనుగు సుభాష్‌రెడ్డి, బోర్లకుంట ప్రభుదాస్, పసియుల్లా, ఏవీఆర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అతిథిగృహం ఎదుట ఉద్రిక్తత

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి పట్టణంలోని చెన్నూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అతిథి గృహం ఎదుట బుధవారం కాంగ్రెస్ నాయకులు బైఠాయించారు. గృహలక్ష్మి పథకం గడువు పెంచాలని కోరుతూ కాంగ్రెస్ టీపీసీసీ సభ్యులు నూకల రమేష్, మహిళ అధ్యక్షురాలు రజని ఆధ్వర్యంలోని ఎమ్మెల్యే అతిథి గృహాన్ని ముట్టడించారు. గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పొడిగించాలని తాము వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే అందుబాటులో లేడని, బయటికి వెళ్ళండని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జె రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్‌లు కాంగ్రెస్ నాయకుల పట్ల దురుసుగా వ్యవహరింగడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మరేసరికి సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఇరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరళించారు. శాంతియుతంగా వినతి ఇచ్చేందుకు వెళ్లిన మహిళలను, బీఆర్ఎస్ నాయకులు దూషించారని ఆరోపిస్తూ బి-1కార్యాలయం ముందు రహదారిపై కాంగ్రెస్ నాయకులు ధర్నాకు దిగారు. మందమర్రి ఎస్సై చంద్రకుమార్ ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గద్దర్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-నస్పూర్

మాల సంక్షేమ సంఘం అధ్వర్యంలో బుధవారం సీసీసీ ఎక్స్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇటీవలే మరణించిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోశిక మనోజ్ కుమార్ మాట్లాడుతూ గద్దర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రజల కోసం మాట్లాడిన మాట, పాడిన పాటలకు మరణం లేనిదని, తొలి దశ తెలంగాణ పోరులో ముందున్నాడని, మళి దశ తెలంగాపోరులో కీలకమైనవాని గుర్తు చేసారు. గద్దర్ పాడిన పాటలతో జనంలో మనో ధైర్యాన్ని నింపిందని, తెలంగాణ సాధించటంలో కీలక పాత్ర పోషించిరన్నారు. అతని జీవితం ప్రజలకు అంకితం చేసారని అందుకే అందరి హృదయాల్లో మరణం లేదని కొనియాడారు. అలాగే తన మరనంతరం కూడా కొంతమంది ఆర్టిస్టులు సోషల్ మీడియా ద్వారా వారిపై విమర్శలు చేయడాన్ని ఇకపై సహించబోమని, వారు తప్పనిసరిగా ప్రజాక్షేత్రంలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వారిపై ఉద్యమించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల కోఆర్డినేటర్ దాసరి వెంకటరమణ, ఉపాధ్యక్షులు జువాజి నందయ్య, పండుగ శ్రీనివాస్, కోశాధికారి కొంపెల్లి పోశం, ముఖ్య సలహాదారులు పసరుగొండ రాజయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు పానుగంటి అరుణ, సంఘం సభ్యులు ధోనిపెల్లి శరణ్, యుగంధర్ సాయి, సారయ్య, మాల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి రూ.5.50 లక్షలు ఇవ్వాలి



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సొంత స్థలం ఉన్నవారికి రూ.ఐదు లక్షల 50 వేలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే హామీని నిలబెట్టుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు కే అశోక్, సీఐటీయూ మండల అధ్యక్షుడు కే బుచ్చయ్య అన్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేనిఫెస్టోలో రూ.ఐదు లక్షల 50 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు గృహలక్ష్మి పేరుతో ఇల్లు నిర్మాణానికి రూ.మూడు లక్షల ఇస్తామనడం దారుణం అన్నారు. ఈ రూ.మూడు లక్షల ఇల్లు నిర్మాణానికి 30 రకాల ధ్రువపత్రాలను అడుగుతున్నారన్నారు. మూడు రోజులే గడువు ఇచ్చి ప్రజలను ఆందోళనకు గురి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గృహలక్ష్మి పథకానికి గడువును పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుడ్ల రాజన్న, దుమల సుధాకర్ అన్నారపు తిరుపతి, టౌటు వెంకటి పాల్గొన్నారు.

సింగరేణిలో బయోమెట్రిక్ విధానం అమలు



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణిలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐటీ వింగ్ నుంచి ఆదేశాల రావటంతో మందమర్రి జీఎం కార్యాలయంలో బయోమెట్రిక్ విధానాన్ని బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానం ద్వారా ఉద్యోగులు అధికారులు హాజరు నమోదు చేసుకోవాలన్నారు. గతంలో కార్పొరేట్ కార్యాలయంతో పాటు జీఎం కార్యాలయాలకు మాత్రమే ఉండగా ప్రస్తుతం విభాగాలు, ఆస్పత్రుల్లో సైతం అమలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈమేరకు సోమవారం సాయంత్రం ఆయా అంశాలకు సంబందించిన ఉత్తర్వులను పర్సనల్ విభాగం ఐఆర్ వింగ్ జీఎం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ విభాగాల్లో పూర్తయిన తర్వాత గనుల్లో కూడా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఉద్యోగులు విధులకు వచ్చి వెళ్లే సమయంలోనే హాజరు నమోదవుతుందని, మధ్యలో స్పందించదని తెలిపారు. బయోమెట్రిక్ విధానం ద్వారా తప్పనిసరిగా 8 గంటలు విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐటీ డివై మేనేజర్ రవి పాల్గొన్నారు.

13న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 13న పురుషుల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నంటి రఘునాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.పురుషోత్తం రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఫుట్ బాల్ సంఘం చైర్మన్ డాక్టర్ కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జు కురువిల్ల, ఆధ్వర్యంలో నిర్వహించడం జరుతాయని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోస్, ఒరిజినల్ ఆధార్ కార్డు జిరాక్స్ కాఫీలను వెంట తీసుకొని జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డిని సంప్రదించాల్సిందిగా కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16వ తేదీ నుండి 23 వరకు వనపర్తి జిల్లా పెబ్బరలో నిర్వహించే రాష్ట్ర సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కం సెలక్షన్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

అనార్‌పల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని అనార్‌పల్లి చౌరస్తాలో బుధవారం ఏ ఎస్సై బాల్ సింగ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలకు సంభవించిన నిజ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు పలు సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను కూర్చోపెట్టకూడదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడుపొద్దని సూచించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహన దారులకు జరిమానా విధించారు. ఏఎస్సైతో పాటు సిబ్బంది ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

డాన్ పబ్లిక్ స్కూల్‌కు తాళం వేసిన ఎంఈఓ

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని డాన్ పబ్లిక్ పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి పోచయ్య సీజ్ చేశారు. పాఠశాల వ్యవహార తీరుకు మంగళవారం విద్యార్థి తండ్రి నరసయ్య పురుగుల మందు తాగగా, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలుపగా ఎంఈఓ పాఠశాలకు తాళం వేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఫీజుల విషయంలో విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ఇలాంటి పాఠశాలలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు పాఠశాలలపై దష్టి సారించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 10 ఆగస్టు 2023

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం

జన్నారం : మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని మండల పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు భూమేష్ అన్నారు. బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేరీ మిట్టి-మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాదిక అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ మొక్కలు నాటి అమృత్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఈఓ రేగొండ రాహుల్ పాల్గొన్నారు.



గ్రామగ్రామాన గృహలక్ష్మి కౌంటర్‌లు ఏర్పాటు చేయాలి

కాసిపేట : గ్రామ గ్రామాన గృహలక్ష్మి కౌంటర్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ పేర్కొన్నారు. బుధవారం కాసిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ గ్రామాన గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని, మండలంలో కేవలం ఒక్కటే దగ్గర అది కూడా ఒకటే కౌంటర్ ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో దూరం నుండి వచ్చేవారు పొద్దున నుండి సాయంత్రం వరకు తిండి తిప్పలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటి వద్దకే వచ్చి ఇందిరమ్మ ఇల్లులు ఇచ్చామని, అలాగే గత 9 సంవత్సరాల క్రితం అర్హులైన అందరికి డబుల్ బెడ్రుమ్ ఇస్తామని ఇంటికి రూ.5 లక్షలు ఇస్తామని ఇప్పుడు ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్, యూత్ నాయకులు నందికొండ శ్రీధర్, పైడిమల్ల జనార్దన్, అరుట్ల శ్రీను పాల్గొన్నారు.

అక్రమ ఉద్యోగ నియామకాలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపధ్యక్షులు షేక్ జాఫర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వివిధ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఎటువంటి నోటిఫికేషన్లు లేకుండా భర్తీ చేస్తున్నారని అటువంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 ఏజెన్సీల ద్వారా ఉద్యోగాల పార్టీ ప్రక్రియ జరుగుతుందన్నారు. బీసీ హాస్టల్, గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం ఏజెన్సీ తీసుకున్న వారు కామాటి, వాచ్ మెన్ పోస్టుల కోసం ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా అడ్డదారిలో భర్తీ ప్రక్రియ చేపట్టారని ఆరోపించారు. వెంటనే దానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కొన్ని ఆశ్రమ పాఠశాలలో మెనూ పాటించడం లేదన్నారు. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ చందర్, ప్రశాంత్, తిరుపతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసులు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. మండలంలోని కొటారి గ్రామంలో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో గిరిజన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. దీనితోపాటు ఏ అవసరం పడ్డ ఉచిత న్యాయ సేవలు లభించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్టాలను ఉపయోగించుకోవడంతో పాటు సామాజిక అవగాహనను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. నమ్మకం అనేది మనిషి ఎదుగుదలకు పునాది లాంటిదని పేర్కొన్నారు. మూఢ నమ్మకాలు మనిషి ఎదుగుదలకు అడ్డుగోడలాగా మారుతాయని చెప్పారు. బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. చిన్న వయసులో వివాహాలు చేయడంతో పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. పెళ్లీడు వచ్చిన పిల్లలకు మాత్రమే వివాహాలు జరిపించాలని తెలిపారు. పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. భ్రూన హత్యలతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది అన్నారు. గ్రామంలో ఎటువంటి ఫిర్యాదులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. యువత మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు. మంచి చెడులపై సూచనలు సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంజనీ దేవి, స్థానిక సర్పంచ్ గుణవంత్‌రావు, ఎస్సై విజయ్ కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దు

నవతెలంగాణ-తాండూర్

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకునే వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవి తెలిపారు. ప్రస్తుతం గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల నుండి నిజమైన లబ్ధిదారుల ఎంపిక జరిగేటప్పుడు అర్హతకు సంబంధించిన పత్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం దరఖాస్తుదారులు వారి వద్దనున్న నిజ ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మతి

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్ నగర్ వద్ద అచలాపూర్ గ్రామానికి చెందిన సిద్ధం శ్రీనివాస్(40) అనుమానస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి తల్లి సిద్ధం మండక్క తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి భార్య తాండూరుకు చెందిన వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందన్న కారణంతో తన కొడుకు మద్యానికి బానిసయ్యాడు. కోడలు బానక్క తన అక్రమ సంబందానికి అడ్డు వస్తున్నాడరి ప్రియుడు మేడి శంకర్‌తో కలిసి తన కొడుకు సిద్ధం శ్రీనివాస్‌ను చంపివేసినట్లు ఫిర్యాదుదారు పేర్కొంది. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని శవ పంచానామ నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ఆస్పత్రికి పంపించారు. సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసీబీ సదయ్యా తాండూర్ సీఐ శ్రీనివాస్, కన్నె పెల్లి ఎస్సై నరేష్ సందర్శించారు. సంఘటన స్థలంలో అనుమానాస్పదంగా ఉన్న సాక్షాలను సేకరించినట్లు ఎస్సై తెలిపారు.

గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటు



నవతెలంగాణ-కాసిపేట

మండలములోని ధర్మారావుపేటలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్ వేములకృష్ణ ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రతికినంత కాలం పేద బడుగు బలహీన వర్గాలకోసం బ్రతికి వారి కష్టాలను పాట రూపంగా ప్రశ్నిస్తూ ఉన్నారని, ఆయన జీవితం ప్రజలకు అంకితం చేసారని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలయిన బీజేపీ, బీఆరెస్ ప్రజలను పట్టి పీడిస్తున్నాయని అందుకని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ఆయన కోరుకున్నారని, వారు అనుకున్న విధంగానే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, మెరుగు పద్మ-శంకర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, మాజీ సర్పంచులు జాడి శంకర్, ప్రభాత్ రావు, ఓరియంట్ సిమెంట్ కార్మికుల సంఘం నాయకులు అన్నం కుమార్, సీనియర్ నాయకులు రషీద్, ఖదీర్, వేణు, పార్వతి పెద్దన్న, ఉడుతల రాజన్న, నాయకులు మహంకాళి, చారి, జాడి శివ, యూత్ నాయకులు మహేష్, ప్రేమ్ కుమార్, మహేష్, నందికొండ శ్రీధర్, జనార్దన్, శ్రీను పాల్గొన్నారు

నేటి నుంచి బోదకాల వ్యాధి నివారణ కార్యక్రమం



నవతెలంగాణ-నస్పూర్

బోదకాలు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని గురువారం నుంచి చిల్లాలో చేపడుతున్నట్టు డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు తెలిపారు. బుధవారం జిల్లా సమీకత భవనంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. జిల్లాలోని ప్రజలందరి చేత నివారణ మాత్రలు మనం మింగుదాం ప్రజలందరి చేత మింగిదం అనే నినాదంతో కార్యక్రమాన్ని విజవంతం చేయాలని సూచించారు. ఆగస్టు 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు మాత్రలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ మాత్రలను రెండు సంవత్సరాలు పైబడిన వారందరికీ ఇవ్వడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు రెండు సంవత్సరాలలోపు పిల్లలకు, అనారోగ్యంగా ఉన్నవారికి మాత్రలు ఇవ్వకూడదని సూచించారు. జిల్లాలోని ఆశ, ఆరోగ్య, అంగన్‌వాడీ, మున్సిపల్, విద్యాశాఖ, ఐసీడీఎస్ సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ అనిత, నీరజ, వెంకటేశ్వర్లు, నాందేవ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-మందమర్రి

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జీఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి సూచనలు సలహాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, సివిల్ డీజీఎం శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సివిల్ ఎస్ ఈ జయప్రకాష్, ఏరియా వర్క్ షాప్ డీజీఎం నరసింహారాజు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, సీనియర్ పిఓ మైత్రేయ బందు, సంక్షేమాధికారి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

రోటిగూడ గ్రామానికి హైలెవెల్ బ్రిడ్జి మంజూరు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటిగూడ గ్రామానికి హై లెవెల్ బ్రిడ్జ్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. హై లెవెల్ బ్రిడ్జి ను మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని బెల్లంపల్లి డీఎల్పీఓ ఫణిదర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని తాండూర్, కిష్టంపేట, రాజీవ్‌నగర్ గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థను, పైపులైన్లను సరి చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. పైపులైన్ లీకేజీలను సరిచేసి గ్రామపంచాయతీ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి ఇంటికి పంచాయతీ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. వాటర్ ట్యాంక్‌లను తనిఖీ చేసి వాటర్ ట్యాంక్‌లను శుభ్ర పరచాలని, బ్లీచింగ్ పౌడర్ క్లోరినేషన్ చేయాలని సూచించారు. మిషన్ భగీరథ మెయిన్ పైప్ లైన్ నుండే మురికి నీరు సరఫరా అవుతోందని పంప్ ఆపరేటర్లు, స్థానికులు తెలియజేశారు. కిష్టంపేట గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీఓ సత్యనారాయణ, రాజీవ్‌నగర్ సర్పంచ్ క్రిష్టపర్ సెక్రెటరీ కల్పన చంద్రమౌళి తపస్ కుమార్‌లు ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణ లోపిస్తే చర్యలు



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లోపిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల గ్రామంలో డంపింగ్ యార్డ్, స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలని సర్పంచ్, కార్యదర్శులకు సూచించారు. వారి వెంట ఎంపీ ఈఓ రమేష్, గ్రామ సర్పంచ్ హనుమంతరావు, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

అంబరాన్నంటిన ఆదివాసుల సంబురం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసుల దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాయి సెంటర్ వద్ద వివిధ ప్రాంతాల నుండి చేరుకున్న ఆదివాసీ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుండి కుమురం భీమ్ చౌక్ వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అక్కడి నుండి ఆదివాసి భవన్‌కు చేరుకున్నారు. కలెక్టర్ బోర్కడే హేమంత్, అదనపు కలెక్టర్ ప్రదీప్ తివారితో కలిసి సంఘాల పెద్దలు నాయకులు ఆదివాసి జెండాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బోర్కడే హేమంత్ మాట్లాడుతూ ఆదివాసుల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా దొరుకుతున్న వనరులను ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఉద్యోగాల కోసం ఎక్కడికైనా వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని, అప్పుడే మార్పు వస్తుందన్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉద్యోగం మేళాలో ఎంపికైన ఆదివాసీ విద్యార్థులు హైదరాబాద్ వెళ్లడానికి విముఖత చూపారని, దీనివల్ల అభివృద్ధి సాధ్యం కాదన్నారు. అవకాశాలు అనేవి కింద నుండి ప్రారంభమవుతాయని, వచ్చిన అవకాశాన్ని ఎప్పుడు కూడా చేజార్చుకోకూడదన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ జాతికి లేని గొప్పతనం ఆదివాసులకు ఉందని, దీనికి నిదర్శనమే ప్రత్యేక దినోత్సవం ఉండడమన్నారు. సంస్కృతి సాంప్రదాయాల కోసం కట్టుబడి ఉండాలని, వాటిని మరిచిన రోజు జాతి విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకంలో ఆదివాసులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో రాణించిన సాక్షి, అంజలి, తీర్థాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పి అచ్యేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, పిఎసిఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆదివాసీ సంఘాల నాయకులు పెందూరి సుధాకర్, నారాయణ, సంతోష్, బీంరావు, గుణవంతరావ్, మాణిక్‌రావు, కేశవరావు, కమల, పోదుబాయి, దశరథ్, ఏసీఎంఓ ఉద్దవ్, జిసిడిఓ శకుంతల పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఆదివాసుల హక్కుల కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని సిపిఐ-ఎంఎల్ పిసిసి సెంట్రల్ కమిటీ సభ్యులు దేవప్రదశర్మ అన్నారు. మండలంలోని జిల్లేడుకుంటలో బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం జరుపుకోవడం అంటే ఆదివాసుల హక్కుల కోసం పోరాడటమేనని అన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన కుమురం భీం స్ఫూర్తితో ఆదివాసుల హక్కుల సాధన కోసం పోరాడాల్సిన అవసరముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసి చట్టాలను, హక్కులని హరించే విధంగా అటవీ చట్ట సవరణ చేస్తోందని, దీనివల్ల ఆదివాసుల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ఆదివాసులపై కక్షగట్టి వారి ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి కొత్త చట్టాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. కుమురంభీమ్, బీర్సాముండా తదితరులు ఆదివాసుల హక్కుల కోసం పోరాటాలు చేసి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఆదివాసుల హక్కుల సాధన కోసం పోరాట వీరుల స్ఫూర్తితో జల్ జంగల్ జమీన్ కోసం, చట్టాల అమలు కోసం ఆదివాసి గిరిజనులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలు సంతన శర్మ, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, నిర్మల్ జిల్లా కార్యదర్శి రాజన్న, ప్రముఖ అడ్వకేట్ వెంకట్ మహేంద్ర, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు నంది సమత, ఏఐపికేఎస్ మండల నాయకులు సోనేరావు, పూసం లక్ష్మణ్, బలవంతరావు, గోనె లచ్చన్న, కుమురం వంతు, భగవంత్‌రావు, భీంరావు, చందు మోహన్, విజ్జక్క పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి చౌరస్తాలో..

ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదా వెంకట్రావు ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆదివాసి పరిషత్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నైతం శ్రీనివాస్, నాయక్ పోడు సేవా సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, సర్పంచ్ లింగు, జరుపుల రాజేశ్వర్ నాయక్, జగ్గు పటేల్ పాల్గొన్నారు.

కౌటాల : ఆదివాసీ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఐటీడీఐ డైరెక్టర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ కమ్యూనిటీహాల్ వద్ద జెండా ఆవిష్కరించి అక్కడి నుండి ఆదివాసీ సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలతో బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడి నుండి తిరిగి వచ్చి కమ్యూనిటీహాల్ వద్ద సమావేశమయ్యారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు సొనాల బస్టాండ్ ఆవరణలో బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ మాట్లాడారు. కుమురం భీమ్ ఆదివాసుల కోసం చేసిన సేవలు మరువలేమన్నారు. కార్యక్రమంలో నాయకులు మేస్రం భూమన్న, పందరం శంకర్, విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలో సవాతి చౌరస్తా వద్ద బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీం విగ్రహానికి పూలమాలలు వేసి జెండాను ఆవిష్కరించారు. ప్రపంచ ఆదివాసులంతా సంఘటితమై సమస్యల కోసం పోరాడాలని సర్పంచ్ గొర్కటె దేవ్‌రావు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సోయం భీంరావు, నవెదరి సర్పంచ్ జంగు, వివిధ గ్రామాల పటేళ్లు, చైర్మన్‌లు, ఆదివాసులు, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

భీమారం : తెలంగాణ ఆదివాసి హక్కుల సాధనే లక్ష్యంగా ఐక్యత చాటి చెప్పాలని తెలంగాణ ఆదివాసీ నాయక్‌పోడ్ మండల అధ్యక్షుడు తైనేని రవి అన్నారు. బుధవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివాసి సంఘాలు ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా తరలి వచ్చి మండల కేంద్రంలోని మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారి మీదుగా డప్పు చప్పుళ్ల మధ్య గిరిజన సాంస్కృతిక నృత్యాలు నిర్వహిస్తూ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు రోడ్డ శ్రీనివాస్, పూజారి కృష్ణమూర్తి, మరినేని లచ్చన్న, పల్ల శ్రీనివాస్, మానుబోతుల కుమార్, గంట స్వరూప, పల్ల శ్రీలత, మేకల లక్ష్మి, తేనెని మహేష్, లక్ష్మణ్, గుంటి సుధాకర్, బునేని చంద్రయ్య, రాజన్న, సుధాకర్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసులు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు తలండి మధూకర్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, సర్పంచ్‌లు సంజీవ్, మధునయ్య, సుధాకర్, చంద్రమౌళి, ఈశ్వరి, ఆదివాసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మండల అధ్యక్షుడు సకారాం, నాయకులు బాపు, లచ్చిరాం, మధూకర్, గురురాజ్, శేఖర్, భుజంగరావు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సాయి, విశ్వేశ్వర్, శంకర్, కోర్తె తిరుపతి, ఆదివాసీ ఉపాధ్యాయులు భిక్షపతి, భుజంగరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జైనూర్ : మండల కేంద్రంలోని మార్కెట్ ఆవరణలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ఆదివాసులతో కలిసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ ఆవరణలో ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కనక యాదవ్‌రావు మాట్లాడారు. ప్రతి ఒక్క ఆదివాసీ హక్కులను సాధించడానికి పోరాడాలన్నారు. మణిపూర్‌లో మహిళలపై ఆకృత్యాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండలంలోని తొమ్మిది తెగలకు చెందిన గ్రామ పెద్దలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయి అవార్డు సాధించి మార్లావాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్ దంపతులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెస్రం మోతిరాం, సర్పంచ్‌లు మడావి భీంరావు, కనక ప్రతిభ వెంకటేశ్, మెస్రం పార్వతి లక్ష్మణ్, మెస్రం నాగోరావు, మెస్రం మనోహర్, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, సిర్పూర్(యు) ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు తుమ్మ భగవంత్‌రావు, ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం అంబాజీ, కొట్నాక మోపత్‌రావు పాల్గొన్నారు.

దండేపల్లి : మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆద్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆదివాసీల జెండా ఆవిష్కరించి సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ సంధర్భంగా ఆదివాసీ సంఘ నాయకులు కనక జంగు, రాయిసెంటర్ జిల్లా నాయకుడు రాము మాట్లాడారు. కొమురంభీం పోరాట స్ఫూర్తిగా తమ హక్కుల సాధన కొరకు ఎంత వరకైనా పోరాటం చేస్తామని అన్నారు. అంతరించిపోతున్న ఆదివాసీలను ఐక్యరాజ్య సమితి గుర్తించి సెప్టెంబర్ 9ని అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందని ఆయన అన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. తాము ఆదివాసిలమని దొడ్డి దారిన వచ్చి తమ రిజర్వేషన్ కొల్లగొడుతూ తమ పిల్ల పొట్ట కొడుతున్నారని ఆయన అన్నారు. అనంతరం ఎంపీడివో మల్లేశం, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసి తెగలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేవ సంఘం నాయకులు కోవ దౌలత్ రావు, కుడిమేత తిరుపతి, పేంద్రమ్ రాము, గోపి, పేంద్రమ్ శ్రీనివాస్, ఆడాయి కాంతరావు, లచ్చు, లింగారావు, సోము, కాంతారావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ఆదివాసీ గూడాలలో ప్రతి ఒక్క గ్రామంలో పటేల్, రాయి సెంటర్ అధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గూడెంలలో జెండా ఆవిష్కరణ చేసి అనంతరం మండల కేంద్రంలో ఆవిష్కరించారు.